
ఘనంగా గణపతి నిమజ్జనం
పాడేరు పట్టణంలో చవితి ఉత్సవాల్లో భాగంగా ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు.
8లో


ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం
ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు.
8లో


ఆటోను ఢీకొట్టిన బస్సు
తెలంగాణకు చెందిన భద్రాచలం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటనలో ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.
8లో

న్యూస్‌రీల్

520 మందికి వైద్య సేవలు


వైద్యాధికారి నుంచి వైద్య శిబిరం వివరాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే పాల్గుణ

హుకుంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో పేదలకు మేలు చేకూరుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు.గురువారం మండలంలోని సూకురులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గిరిజనుల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. జగనన్న సురక్షతో వైద్యం గిరిజనుల చెంతకు వచ్చిందన్నారు. వైద్య శిబిరంలో 520 మందికి సేవలందించినట్టు వైద్యాధికారిణి డా.గాయత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, సీడీపీవో బాలచంద్రమణి దేవి, ఏపీవో లింగమూర్తి, ఈవోపీఈఆర్డీ అశోక్, సర్పంచ్ ధనసాని సత్యవతి, ఎంపీటీసీ కిలగడ సింహాచలం, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ ఎస్. కొండలరావు పాల్గొన్నారు.


ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీతో ఒప్పందం


ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జోగినాయుడు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సెంటర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్)తో గురువారం ఎంవోయూ కుదుర్చుకుంది.రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన వివిధ ఆహార ఉత్పత్తులకు జీవ ట్యాగ్‌ల దాఖలను ప్రోత్సహించనుంది. ఆహార ఉత్పత్తికి సంబంధించి మద్దతు, నైపుణ్యం, వనరుల మార్పిడికి సహకారం అందించనుంది.ఇందుకోసం సెమినార్లు, ఎగ్జిబిషన్లు, సింపోజియంలు, వర్క్‌షాపులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకోవడం కోసం ఈ ఒప్పందం జరిగింది. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ రిజిస్ట్రార్ జోగినాయుడు, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారులు చిరంజీవి చౌదరి, ఐఎఫ్ఎస్ ప్రిన్సిపాల్ సెక్రటరీ (అగ్రికల్చర్ మార్కెటింగ్, కో ఆపరేటివ్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్) సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకొన్నారు.

అసంపూర్తి భవనాలకు మోక్షం

- రూ.30 లక్షలు వెచ్చించిన పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్


ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ప్రభుత్వ వైద్యాధికారుల నివాస గృహాలపై పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేకదృష్టి సారించారు. ఆయన సుమారు రూ.30 లక్షలు కేటాయించడంతో పనులు జోరందుకున్నాయి. గత ప్రభుత్వం రెండు బ్లాక్‌లలో చేపట్టిన మొత్తం 12 క్వార్టర్ల నిర్మాణం శ్లాబ్ స్థాయికి పరిమితమయ్యాయి. వీటిని పూర్తి చేసేందుకు నిధులు కేటాయించిన పీవో అభిషేక్ గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్‌శాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు పర్యవేక్షణలో పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే ఒక బ్లాక్ పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు నెలాఖరుకు పూర్తి చేసి ప్రారంభించేందుకు గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. పాడేరులో వైద్యకళాశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో నివాస గృహాలకు ప్రాధాన్యం పెరిగింది. ఇవి పూర్తయితే కొంతవరకు వైద్యులకు వసతి సమకూరినట్టే. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించిన ఐటీడీఏ పీవో అభిషేక్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.


ప్రారంభానికి సిద్ధమవుతున్న ప్రభుత్వ వైద్యాధికారుల నివాస గృహాలు

పాపికొండల విహారం.. ఓ పరవశం


పేరంటాలపల్లి బోట్ పాయింట్ వద్ద పాపికొండలు విహారానికి వచ్చిన పర్యాటకులు

- ఎత్తయిన కొండల మధ్య గోదావరిపై విహారం
- ఎటుచూసినా ప్రకృతి అందాలు
- అడుగడుగునా ఆకట్టుకునే దృశ్యాలు
- మంత్రముగ్ధులవుతున్న పర్యాటకులు

పాపికొండల ప్రయాణం ఓ మధురానుభూతి. గలగల పారే గోదారిలో వడి వడిగా సాగే లాంచీ ప్రయాణం. గోదారమ్మను అనుకుని పచ్చని కొండలు. ఆహ్లాదాన్నిచ్చే ఇసుక తిన్నెలు. చల్లగా తాకే పిల్ల గాలులు.. ఈ ప్రయాణం ఓ అద్భుతమనే చెప్పాలి. అందుకే ప్రతిఒక్కరూ తమ జీవితంలో ఒక్కసారైనా ఈ ప్రకృతి అందాల నడుమ విహరించాలని తహతహలాడుతుంటారు.

వీఆర్‌పురం: జిల్లాలో పాపికొండల విహారయాత్రకు వెళ్లేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. మండలంలోని పోచవరం బోట్ పాయింట్ ఒకటి కాగా, దేవీపట్నం మండలంలోని పోచమ్మగండి పాయింట్ మరొకటి. వీటికి టికెట్ బుకింగ్ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో బుక్ చేసుకునే సౌకర్యం ఉంది. టిక్కెట్ ధర పెద్దలకు రూ.950 ,పిల్లలకు రూ. 750 వసూలు చేస్తారు.

- పోచవరం బోటింగ్ పాయింట్ నుంచి ఉదయం 9.30 గంటకు లాంచీలు పాపికొండల యాత్రకు బయలు దేరతాయి. లాంచీలు బయలు దేరే ముందు పర్యాటకులకు నిర్వాహకులు టి.టిఫిన్లు సరఫరా చేస్తారు. పూర్తయిన తరువాత లాంచీలు బయలుదేరుతాయి.
- పాపికొండలు పర్యటనలో ఎన్నెన్నో అందాలు. పోచవరం బోట్ పాయింట్ నుంచి సుమారు పది కిలోమీటర్ల ప్రయాణించిన తరువాత ఏలూరు జిల్లా వైపు ఉన్న పేరంటపల్లి పురాతన శివాలయాన్ని దర్శించుకోవచ్చు. లాంచీలోనే సిబ్బంది భోజనం సమకూరుస్తారు.
- బోట్ పాపికొండల శివారు ప్రాంతం సిరివాక వరకు లాంచీప్రయాణం సాగుతుంది. అక్కడితో విహారయాత్ర ముగిసి తిరుగు ప్రయాణంలో పోచవరం బోట్‌పాయింట్‌కు చేరుకుంటుంది.
- గోదావరిలో సుమారు ఆరు గంటల పాటు సాగే ప్రయాణం పర్యాటకులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది. గోదావరికి దిగువున ఉన్న పోచమ్మగండి బోట్ పాయింట్ నుంచి కూడా పయనమైన బోట్లు కూడా పేరంటాలపల్లిలోని శివాలయాన్ని సందర్శించుకొని తిరిగి పయనం అవుతాయి..

ప్రత్యేక రక్షణ చర్యలు

పర్యాటకులు బోట్ ఎక్కినప్పటి నుంచి తిరిగి గమ్యస్థానం చేరుకొనే వరకు అన్ని విధాలా రక్షణ చర్యలను టూరిజం శాఖ పర్యవేక్షిస్తుంది. పర్యటకానికి వెళ్లే ప్రతీ బోట్ పోచవరం బోట్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు వైర్‌లెస్ సెట్ ద్వారా అనుసంధానమై ఉంటుంది. పర్యటకుల వివరాలను బోట్ ఎక్కే ముందుగానే సిబ్బంది సేకరిస్తారు. పర్యటకానికి వెళ్లే ప్రతీ బోటుకు రక్షణగా కంట్రీ బోట్ పర్యవేక్షణ ఉంటుంది.


పాపికొండలు

సెలవు రోజుల్లో రద్దీ


సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. మిగతా రోజుల్లో సాధారణంగా పర్యాటకులు వస్తున్నారు. పాపికొండల సందర్శనకు వెళ్లే వారికి రాష్ట్ర పర్యాటకశాఖ పటిష్టమైన చర్యలు చేపడుతోంది.

– సీహెచ్ రాజేష్, ఏపీ టూరిజం, మేనేజర్, పోచవరం బోట్ పాయింట్


పేరంటాలపల్లి వద్ద పర్యాటకుల సందడి


పోచమ్మగండి వద్ద లాంచీఎక్కుతున్న పర్యాటకులు


పేరంటాలపల్లిలోని పురాతన శివాలయం

టెన్త్‌లో నూరుశాతం మార్కుల సాధనే లక్ష్యం

- రాత పరీక్ష ఆధారంగా 50 మంది విద్యార్థుల ఎంపిక
- పూర్తిస్థాయిలో ప్రత్యేక శిక్షణ
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



పాడేరు రూరల్ : టెన్త్‌లో నూరుశాతం మార్కులు సాధన లక్ష్యంగా ప్రణాళికాపరంగా చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. దీనిలో భాగంగానే ఏజెన్సీ పరిధిలోని 122 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న 320 మంది విద్యార్థులను ఎంపిక చేశామని చెప్పారు. వీరిలో 50 మందిని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసి టెన్త్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు రాత పరీక్ష

పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన టెన్త్ విద్యార్థులకు ఈనెల 6న పాడేరులో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు పీవో అభిషేక్ తెలిపారు. పాడేరు పట్టణంలోని లోచలిపుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 180 మంది బాలురకు, శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 140 మంది బాలికలకు రాత పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. వీరిలో ప్రతిభ ఆధారంగా 50 మందిని ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తామని పీవో పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- పలు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

పాడేరు రూరల్ : రాష్ట్రంలో సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లుగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఆమె పట్టణంలోని గుడివాడ గ్రామ సచివాలయం–1, పక్కనే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, పాత పాడేరులో గ్రామ సచివాలయం–2, లగిసపల్లి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడేది ప్రతిదీ అభివృద్ధేనన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ప్రజల ఉమ్మడి ఆస్తి అని దీనిని అభివృద్ధి కాకుండా మరేమి అంటారో ప్రతిపక్షాలు స్పష్టం చేయాలన్నారు. ప్రజల వద్దకే పాలనకు తీసుకువెళ్లలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను నిర్మిస్తోందన్నారు. గడపవద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామ స్వరాజ్యం స్థాపన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడిందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. నిరంతరం ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలందించేందుకు ప్రత్యేకంగా వెల్‌నెస్ కేంద్రాలను నెలకొల్పిందన్నారు. గ్రామాల్లో నెలకొన్న చిన్న, చిన్న సమస్యలను కూడా దశలవారీగా పరిష్కారిస్తున్నామని చెప్పారు. పాడేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 5వేల మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకాన్ని, ప్రతి అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏ సమస్యలు ఉన్నా సమీప గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నవీన్ సాయి, పంచాయతీరాజ్ జేఈ బాబుప్రసాద్, పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఎంపీటీసీ సల్లా చిట్టమ్మ, వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం. సరస్వతి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, లకే పార్వతమ్మ, సొమేలి లక్ష్మణ్‌రావు, కుర్రబోయిన సన్నిబాబు, వంతాల సీతమ్మ, ముచ్చల మీనా, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, లకే రామకృష్ణపాత్రుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శిరగం దశమూర్తి, జిల్లా కార్యదర్శి పసుపుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



లగిసపల్లిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవలో 22 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు మీసాల అశోక్‌కుమార్, బి.అనురాధ, ఎస్.సతీష్, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్.సురేష్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ.. : కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

నేడు హుకుంపేటలో జగనన్నకు చెబుదాం

- పాడేరు ఐటీడీఏలో స్పందన రద్దు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పాడేరు ఐటీడీఏలో స్పందన మాత్రం రద్దు చేసినందును జిల్లా ప్రజలెవ్వరు ఐటీడీఏకు రావొద్దని ఆయన సూచించారు. హుకుంపేటలో జరిగే స్పందన కార్యక్రమాన్ని మండలంలో ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నిశాఖల జిల్లా అధికారులు హుకుంపేటలో నిర్వహించే ప్రత్యేక స్పందనకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. స్పందన అనంతరం ఆయా శాఖల జిల్లా అధికారులు సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

మూడు పీహెచ్‌సీలకు అరుదైన గుర్తింపు

- జి.మాడుగుల, లోతుగెడ్డ, లాగరాయిలో ప్రమాణాలకు తగ్గట్టుగా వైద్య సేవలు
- ప్రకటించిన నేషనల్ హెల్త్ రీసెర్చి సెంటర్ వైద్య బృందం
- ఒకొక్కదానికి రూ.10 లక్షల నిధులు
- మూడేళ్లపాటు కేటాయింపు

జి.మాడుగుల: జిల్లాలో నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్సు స్టాండర్డ్స్‌కు అనుగుణంగా సేవలు అందిస్తున్న మూడు పీహెచ్‌సీలను ఢిల్లీకి చెందిన నేషనల్ హెల్త్ రీసెర్చి సెంటర్ వైద్య బృందం ఎంపిక చేసింది. వీటిలో జి.మాడుగుల, లోతుగెడ్డ, లాగరాయి పీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు శశికాంత్, రవిచంద్రశేఖర్, విగ్నేష్‌ను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అభినందించారు. ఒక్కొక్క పీహెచ్‌సీ నిర్వహణకు ఏడాదికి రూ.10 లక్షల చొప్పున మూడేళ్లపాటు రూ.30 లక్షల చొప్పున అందజేస్తుందని అధికారవర్గాలు తెలిపాయి. ఈ నిధులతో పీహెచ్‌సీలో మరింత వసతులు సమకూర్చుకునేందుకు అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు.


జి.మాడుగుల పీహెచ్‌సీ వైద్యాధికారులు శశికాంత్, రవిచంద్రశేఖర్ వైద్య సిబ్బందితో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. చింతపల్లి, రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో వర్చువల్ విధానంలో ఆయన సమీక్షించారు. అట్రాసిటీ బాధితులకు పరిహారం చెల్లించారా లేకుంటే పరిశీలించి చెల్లింపునకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో 134 అట్రాసిటీ కేసులు ఉన్నాయని పూర్తిస్థాయిలో విచారణ జరిపి చార్జిషీట్ వేయాలన్నారు. పాఠశాలలు, గ్రామ పంచాయతీలలో సివిల్స్‌డేపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కేసుల పరిష్కారానికి కులధ్రువీకరణపత్రాలు లేకపోవడం వల్ల ఇబ్బందులున్నాయని పోలీస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఐటీడీఏ పీవోలను సంప్రదించి కులధ్రువీకరణపత్రాలు పొందాలని సూచించారు. భూ సమస్యలు, వివాహ సమస్యలు కమిటీ దృష్టికి తీసుకురావాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. బాధితులకు పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంటే మండల కమిటీలు ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వానికి నివేదించి మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పాడేరు ఏఎస్పీ కె.ధీరజ్, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు జి. జనార్దనరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సహాయ కమిషనర్ టి.సుజాత, రంపచోడవరం ఏటీడబ్ల్యూవో రామతులసి, ఏఎస్ డబ్ల్యూవో డి.ఎల్. ఆనందరావు, కమిటీ సభ్యులు చెండా లోహితాస్, పలాసి యువరాజ్ పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ ఉద్యోగులకు మారిటైమ్ అవార్డులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఉద్యోగులు మూడు మారిటైమ్ ఎక్స్‌లెన్సీ అవార్డులను దక్కించుకున్నారు. ముంబయిలో గురువారం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఉత్తమ షిప్ రిపేర్ విభాగంలో సీనియర్ మేనేజర్ మాధవరావు, ఉత్తమ టెక్నాలజీ ఇన్నోవేషన్, వుమెన్ లీడర్‌షిప్ విభాగంలో మహిళా ఉగ్యోగులు లీలామాధవి, భానుప్రియ ఈ అవార్డులు స్వీకరించారు.


మారిటైమ్ ఎక్స్‌లెన్సీ అవార్డులతో హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఉద్యోగులు

యూపీఎస్సీ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

మహారాణిపేట: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్–2023కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష చేపట్టారు. ఈ నెల 7, 8 తేదీల్లో యూపీఎస్సీకి సంబంధించి కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, మొత్తం 2,962 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు యూపీఎస్సీ నిబంధనలకు కచ్చితంగా పాటించాలని సూచించారు. అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రాల్లోకి పంపించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షల నిర్వహణకు సహకరించాలని కోరారు. యూపీఎస్సీ పరిశీలకుడు ఎస్.హెచ్.రాహుల్ గార్గ్, పరీక్షల విభాగం సూపరింటెండెంట్ పాల్ కిరణ్, జీవీఎంసీ, పోలీస్, మెడికల్, ఈపీడీసీఎల్, లైజనింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా గణపతి నిమజ్జనం



ఊరేగింపులో అలరించిన శక్తివేషాలు

సాక్షి,పాడేరు: పట్టణంలోని సినిమాహల్ సెంటర్‌లో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఊరేగింపు భారీస్థాయిలో నిర్వహించారు. శక్తివేషాలు, తీన్‌మార్ డప్పులు, డీజే సౌండ్‌తో పాడేరు పట్టణం హోరెత్తింది. యువకులు డ్యాన్సులు వేసి సందడి చేశారు. చిలకలమామిడి గెడ్డలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

86 నర్సు పోస్టులకు 9,100 దరఖాస్తులు

మహారాణిపేట: స్టాఫ్ నర్సు పోస్టుల దరఖాస్తు గడువు గురువారంతో ముగిసింది. రాష్ట్రంలో 434 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా.. జోన్-1 పరిధిలో మొత్తం 86 నర్సు పోస్టుల కోసం గత నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జోన్-1 పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 9,100 మంది గడువు ముగిసే సమయానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలన చేస్తున్నామని.. త్వరలోనే అర్హుల జాబితాను విడుదల చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్. ఉమా సుందరి వెల్లడించారు.

క్రీడా పోటీలకు సై

- నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు
- ప్రతిభ చూపితే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత
- ఉమ్మడి విశాఖ జిల్లాలో సిద్ధమైన వేదికలు



విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 క్రీడా పోటీలకు అంతా సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఈ నెల 13 వరకు జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టి.నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన నిర్వహించే పాఠశాల స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఇదో చక్కని అవకాశం. జిల్లా స్థాయి క్రీడా జట్లు ఎంపిక చేసేందుకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనువైన క్రీడా వేదికలను ఎంపిక చేశారు. పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏఏ పోటీలు ఎక్కడంటే..

- బాలబాలికల అథ్లెటిక్స్ సెలక్షన్లు శుక్రవారం విశాలాక్షినగర్‌లోని డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో జరుగుతాయి.
- ఈ నెల 7న అండర్-14 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు పరవాడ పోలీసు స్టేషన్ ఎదురుగా జేఆర్‌ఎం కాలనీలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో, అండర్ -17 పోటీలు పరవాడలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తారు.
- ఈ నెల 8న అండర్-14, 17 బాలబాలికల రోల్‌బాల్ సెలక్షన్లు విశాఖలోని మురళీనగర్‌లో జరుగుతాయి.
- ఈ నెల 9న అండర్-14,17 బాలబాలికల యోగా సెలక్షన్లు పరవాడ ధర్మారాయుడుపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తారు. అండర్-17 బాక్సింగ్ సెలక్షన్లు నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయి. అండర్-14, 17 బాలబాలికల సేపక్‌తక్రా సెలక్షన్లు అనకాపల్లి జిల్లా కశింకోటలోని ఏఎస్ పేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తారు. అండర్- 14, 17 ఆర్చరీ సెలక్షన్లు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు వ్యాలీ స్పోర్ట్స్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.
- ఈ నెల 10న అండర్-14 బాలుర బాక్సింగ్ సెలక్షన్లు విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో, అండర్-14 బాలబాలికల వాలీబాల్ పోటీలు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని తలారి సింఘిలో జరుగుతాయి. అండర్-14, 17 బాలబాలికల నెట్‌బాల్ సెలక్షన్లు భీమిలి సన్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. అండర్-14, 17 బాలబాలికల స్కేటింగ్ సెలక్షన్లు విశాఖలోని వీఎంఆర్డీఏ పార్కులో జరుగుతాయి. అండర్-14, 17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు అనకాపల్లి ఎస్‌ఆర్‌జీ జిమ్‌లో నిర్వహించనున్నారు.
- ఈ నెల 11న అండర్-14 బాలబాలికల త్రోబాల్ సెలక్షన్లు విశాఖ జిల్లా కణితి జెడ్పీ హైస్కూల్‌లో, అండర్-14, 17 స్విమ్మింగ్ పోటీలు విశాఖపట్నంలోని రైల్వే స్విమ్మింగ్ పూల్‌లో జరుగుతాయి. అండర్ -14,17 బాలబాలికల ఫెన్సింగ్ పోటీలు అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. అండర్-14, 17 బేస్‌బాల్ పోటీలు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని వేములపూడి జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతాయి. పవర్‌లిఫ్టింగ్ పోటీలు అనకాపల్లి ఎస్‌ఆర్‌జీ జిమ్‌లో ఏర్పాటు చేశారు.
- ఈ నెల 12న అండర్-14, 17 బాలబాలికల కరాటే పోటీలు నగరంలోని స్వర్ణభారతి స్టేడియంలో, అండర్-17 క్రికెట్ సెలక్షన్లు అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో, అండర్-14, 17 చెస్ సెలక్షన్స్ అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు.
- ఈ నెల 13న అండర్ -14, 17 బాయ్స్ అండ్ గర్ల్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు అనకాపల్లి జిల్లా పరవాడ దగ్గర తానం ప్రభుత్వ హైస్కూల్‌లో, అండర్-14 క్రికెట్ పోటీలు పెందుర్తి సమీపంలోని పినగాడి వెల్ఫేర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో, అండర్-14, 17 సాఫ్ట్‌బాల్ పోటీలు భీమునిపట్నం జీవీఎంసీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు నాగేశ్వరరావు వెల్లడించారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్



సీమంతాలు, అన్నప్రాశన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

గంగవరం : ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తాడ గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షా వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైద్య నిపుణులతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ఏజెన్సీ ప్రజలకు వరమని వారు పేర్కొన్నారు. పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరతన్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు కృష్ణ సందీప్, శ్రీరాగ, వైద్యులు భావన, నిహిత తదితరులు 415 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీడీపీవో లక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో శ్రీనివాసులు, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, సర్పంచ్‌లు కామరాజుదొర, మరిడమ్మ, రమణమ్మ, నెల్లిపూడి ఎంపీటీసీ కనకలక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సంకురుదొర, సింగారమ్మ, సచివాలయ కార్యదర్శి అజయ్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు

నలుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ప్రయాణికుడు

ఎటపాక: రాష్ట్ర సరిహద్దుల్లో గురువారం తెలంగాణకు చెందిన భద్రాచలం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటనలో ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. సీతంపేట వద్ద జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణలోని చర్ల నుంచి భద్రాచలం వస్తున్న ఆటోను వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆటో నుజ్జువగా అందులో ఉన్న ప్రయాణికుల్లో నలుగురికి తీవ్రంగా, ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి.వీరిని చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో తూరుబాక గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఉన్నారు. మిగతావారు కేశవాపురం, నల్లబెల్లి ప్రాంతాలకు చెందిన వారని స్థానిక పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం : పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. బాలాసోర్ -హల్దిపడ మధ్య జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం మరికొన్ని రైళ్లు రద్దు చేస్తున్నట్టు తెలిపారు.

హౌరాలో గురువారం ఉదయం 8.30గంటలకు బయల్దేరవలసిన హౌరా-సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12గంటలకు బయల్దేరింది. షాలిమార్‌లో గురువారం ఉదయం 11.25 గంటలకు బయల్దేరవలసిన షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.25గంటలకు బయల్దేరింది. హౌరాలో గురువారం సాయంత్రం 5.40 గంటలకు బయల్దేరవలసిన హౌరా- తిరుచ్చిరాపల్లి (12664) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 8.30గంటలకు బయల్దేరింది. బాలాసోర్-హల్దిపడ స్టేషన్ల మధ్య జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఆయా స్టేషన్లలో శుక్రవారం, శనివారం బయల్దేరవలసిన ఎస్‌ఎంవీ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమర్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేశారు.

కేకే లైన్లో ..

వాల్తేర్ డివిజన్, కొత్తవలస-కిరండూల్ (కే-కే) లైన్, మనబార్-జరాటి స్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్‌పై కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో ఇంకా పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్?ద్దకే త్రిపాఠి తెలిపారు. శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్- జగదల్‌పూర్ (18447)హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగుప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరవలసిన జగదల్‌పూర్-భువనేశ్వర్ (18448)ఎక్స్‌ప్రెస్ శనివారం నుంచి 12వ తేదీ వరకు కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది. శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు విశాఖలో బయల్దేరే విశాఖ- కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్-విశాఖ(18513)ఎక్స్‌ప్రెస్ శనివారం నుంచి 12వ తేదీ వరకు కోరాపుట్‌లో బయల్దేరి విశాఖ చేరుకుంటుంది.శనివారం నుంచి 12వ తేదీ వరకు విశాఖ బయల్దేరే విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్-విశాఖ (08552) పాసింజర్ స్పెషల్‌గా శనివారం నుంచి 12వ తేదీ వరకు అరకులో బయల్దేరి విశాఖ చేరుకుంది. శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు హౌరాలో బయల్దేరే హౌరా -జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తోంది. తిరుగుప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరవలసిన జగదల్‌పూర్ - హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా శనివారం నుంచి 12వ తేదీ వరకు టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

చిన్నారుల చదువుపై తల్లిదండ్రుల శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న ఏజెన్సీ గురుకుల పాఠశాలల కన్వీనర్ ప్రిన్సిపాల్ పాల్ కేశవరావు



సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

పెదబయలు: పాఠశాల కళాశాలల్లో చదువుతున్న పిల్లల పట్ల తల్లితండ్రులు బాధ్యత తీసుకోవాలని ఏజెన్సీ గురుకులాల కన్వీనర్ ప్రిన్సిపాల్ వై.పారయ్య అన్నారు.గురువారం కళాశాల ఆవరణలో తల్లితండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్య అందిస్తోందన్నారు. తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లల చదువుపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులతో సంప్రదించి, తమ పిల్లల విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు ఇవ్వొద్దని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని ఇంటికి వచ్చిన సమాయానికి కళాశాలకు తిరిగి తీసుకురావాలని తల్లితండ్రులను కోరారు. కార్యక్రమంలో భాగంగా 11 మంది సభ్యులతో కూడిన పేరెంట్స్ కమిటీని ఏర్పాటు చేశారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. ఈశ్వరమ్మ, ముంచంగిపుట్టు ఈఎంఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ కేశవరావు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



గంగవరం జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రేంజ్ అధికారి కరణాకర్



ఇందుకూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న రేంజర్ దుర్గాప్రసాద్‌కుమార్‌బాబు

రంపచోడవరం: విద్యార్థులు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఇందుకూరు అటవీ రేంజర్ అధికారి వి.దుర్గాకుమార్‌బాబు అన్నారు. రంపచోడవరం సమీపంలోని ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురువారం వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీ అభివృద్ధికి చర్యలు అనే అంశంపై తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు రేంజర్ దుర్గాకుమార్‌బాబు, హెచ్‌ఎం కెఆర్‌పీ కుమార్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం : వన్య ప్రాణుల పట్ల అవగాహనలో ప్రకృతికి యువత పునరంకితం కావాలని ఫోక్స్‌పేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.కరుణాకర్ పిలుపునిచ్చారు. వన్య ప్రాణి వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ మాట్లాడారు. వన్య ప్రాణులు లేకుండా వనాలు ఊహించలేమన్నారు.వన్యప్రాణులను కాపాడండి - ఆహ్లాదాన్ని ఆస్వాదించండి అంటూ విద్యార్థులు, అధ్యాపకులు, అటవీశాఖ సిబ్బందితో నినదింపజేశారు. యువత ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని భావితరాలవారికి అందించేందుకు నడుం కట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ అన్నారు. అధ్యాపకులు శివాజీ, న ఫీజా , శిరీష, పాల్గొన్నారు. అనంతరం మండలంలోని భయనపల్లి, ఉమ్మెత్త గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి గ్రామస్తులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. వన్యప్రాణి వేటపై 18004255909 9989785623 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. డీఆర్‌వో సుజాత, ఎఫ్‌ఎస్‌ఓ లు నూకరాజు, అప్పారావు, మాణిక్యం, మనోహర్, పద్మ, సుభద్ర, పాల్గొన్నారు.



పి.యర్రగొండలో విజేతలకు బహుమతి అందజేస్తున్న రేంజ్ అధికారి షహెన్‌షా

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం అటవీశాఖ అడ్డతీగల రేంజ్ అధికారి సయ్యద్ షహెన్‌షా ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి షహెన్‌షా మాట్లాడుతు, వణ్యమృగ సంరక్షణ, అడవుల పరిరక్షణపై విద్యార్థులు అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన సీహెచ్.ప్రవల్లిక, రన్విత, నవ్యశ్రీలకు బహుమతులు అందజేశారు.

ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ, డిప్యూటీ రేంజి అధికారి సీహెచ్ సత్యనారాయణ, సెక్షన్ అధికారి మోహన్ పాల్గొన్నారు.

మూగజీవులకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు

చింతపల్లిరూరల్: మూగజీవులకు మెరుగైన వైద్యం అందించేలా వైద్యులు కృషి చేయాలని పాడేరు, అనకాపల్లి పశుసంవర్ధక శాఖ డివిజనల్ డీప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ నరసింహులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మూడు మండలాల పశుసంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బందితో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పశుసంపద అభివృద్ధికి పశుసంవర్ధక సహాయకులు రైతులకు సహకరించాలన్నారు. ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే ఐసీఎంఆర్ సూచన మేరకు ఏడాదికి 186 గుడ్లు, 11 కిలోల మాంసం, ప్రతి రోజు 285 గ్రాముల పాలు తీసుకోవాలన్నారు. దీనికి తగిన రీతిలో ప్రజలు కోళ్లు, మేకలు, గొర్రెలను, గోవులను పెంచుకోవాలన్నారు.పశువులకు వ్యాధులు సోకకుండా పశుసంవర్ధక శాఖ టీకాలు వేస్తుందని, ఒకవేళ వ్యాధులు సోకితే చికిత్స అందించేందుకు తగిన ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానంగా లంపీస్కిన్, గాలికుంటు, పీపీఆర్, బ్రుసెల్లా టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. వైద్యులు మూగజీవులకు వైద్యం అందించేందుకు సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండాలన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే రైతులు 1962 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందిస్తే, పశువైద్య సిబ్బంది వచ్చి సేవలు అందిస్తారన్నారు.ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు జాతీయ గణ మీషన్(ఎన్‌ఎల్‌ఎం)ద్వారా కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ పై రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణం మంజూరు చేస్తుందన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పశుసంవర్ధక శాఖ సేవలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్, మూడు మండలాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై పెరిగిన ఆసక్తి

స్పేస్ వాక్ ప్రారంభించిన డీసీపీ-2 ఆనందరెడ్డి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆనందరెడ్డి

బీచ్‌రోడ్డు: చంద్రయాన్-3 విజయం భారతీయుల్లో కొత్త శక్తిని, అంతరిక్ష పరిశోధనలపై యువతలో ఆసక్తిని కలిగించిందని డీసీపీ-2 కె.ఆనందరెడ్డి అన్నారు. భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో), సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్), రఘు విద్యా సంస్థలు సంయుక్తంగా గురువారం బీచ్‌రోడ్డులో వాక్ ఫర్ స్పేస్ వీక్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద డీసీపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ అద్భుత విజయాలు సాధిస్తోందన్నారు. భవిష్యత్‌లో దీనిని మరింత అభివృద్ధి చేసి, ముందుకు నడిపించే బాధ్యత యువత తీసుకోవాలన్నారు. అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ కార్యక్రమ నిర్వహణ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానంతోనే మానవ అభివృద్ధి సాకారమవుతుందన్నారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ షార్, ఇస్రో నిర్వహిస్తున్న నాలుగు రోజుల ప్రత్యేక కార్యక్రమాలను విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షార్, ఇస్రో శాస్త్రవేత్తలు, రఘు విద్యా సంస్థల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, పోలీస్ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్న ర్యాలీ ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగింది.

ఆచార్య కృష్ణమోహన్‌కు అభినందనలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఓఎస్డీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య వి.కృష్ణమోహన్‌ను గురువారం ఉత్తరాంధ్ర విద్యార్థి సేన, పలువురు ఆచార్యులు అభినందించారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, హెచ్‌ఆర్‌ఎం విభాగాధిపతి ఆచార్య అరుణ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య విజయమోహన్ ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ విద్య, పరిశోధన, పరిపాలన తదితర అంశాలపై విశేష అనుభవం ఉన్న ఆచార్య కృష్ణమోహన్‌ను ఓఎస్డీగా నియమించడం శుభపరిణామన్నారు. సేన ఏయూ ఇన్‌చార్జి సుబుద్ధి శ్రీరామ్, నాయకులు సన్యాసినాయుడు, చైతన్య, నాగరాజు, రాజశేఖర్, ప్రసాద్ ముల్లు మహేష్, కంఠం రెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.